
శతకాలు

# శ్రీనివాస శతకము




సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!


ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఓం

# శ్రీనివాస శతకము

పద్య కవితా సంస్థ



చింతలపాటి పూర్ణచంద్రరావు

ప్రథమశ్రేణి తెలుగు పండితుడు

ఘంటశాల - 521 133

కృష్ణాజిల్లా, ఎ.పి.



# విషయ సూచిక


1. శ్రీనివాస శతకము

2. వృత్త సంకీర్తనము

   -. శ్రీ వేంకటేశ్వర నక్షత్రమాలిక

   2. నివేదన

   3. ఆకాంక్ష

# శ్రీనివాస శతకము



శ్రీగణాధినాథు – సేవించి తొలుదొల్త
శతక రచన సేయ – సాహసింతు
లలిత భావజాల – మలరారునట్లుగా
చిత్తశుద్ధి నిడుము – శ్రీనివాస!! 1

పలుకులమ్మ పాద – పంకేరుహమ్ములన్
మనమునందు దలతు – ఘనముగాను
హృద్యమైన పద్య – మెదలోన తళుకొత్తు
చింతనమ్ము నిమ్ము – శ్రీనివాస!! 2

తెనుగు భారతి నిల – తీర్చి దిద్దిన యట్టి
నన్నయాది కవుల – సన్నుతించి
వారి బాటలోన – పయనించునట్లుగా
జ్ఞానదీపమిడుము – శ్రీనివాస!! 3

మధురభక్తి చేత – మాధవైక్యమయిన
భక్తకోటి కేను – ప్రాంజలించి
మనసులోని మాట – వినిపింప దొరకొందు
సింధు శయన వినుము – శ్రీనివాస!! 4

శ్రీసతీమ తల్లి – చిరునవ్వు చిందింప
పరవశించునట్టి – పరమ పురుష
పద్య కవిత చేత – పండించి గుండెను
చేరి కొందు నిన్ను – శ్రీనివాస!! 5

శ్రీగలాడవంచు – సేవించు జనతకు
కామితార్థమిడెడి – కల్ప భూజ
కరుణతోడ మమ్ము – కాపాడు చుండుమా
శిరము వంచి కొల్తు – శ్రీనివాస!! 6

శ్రీవరాహమూర్తి – సీమలో నెలకొన్న
నిరుపమాన రూప – నిర్వికార
భక్తి భావ మొసగి – భవ బంధములు త్రుంచు
చిరయశో విశాల – శ్రీనివాస!! 7

కమల నయన నీదు – కడగంటి చూపులు
మూడు జగము లేలు – మురిపె మలర
భద్ర కరములైన – భవదంఘ్రి యుగ్మంబు
శ్రీకరంబు మాకు – శ్రీనివాస!! 8

మంద మంద హసిత – సుందర వదనంబు
హృదయ పద్మ మందు – సుధను నింప
కూర్మి మీర తలతు – గోవింద నామంబు
శ్రేయ మొనర జేయు – శ్రీనివాస!! 9

వేంకటాద్రిపైన – సంకట హరుడవై
వెలసియున్న నిన్ను – వేడ్క మీర
వేయు నోళ్ళనైన – వినుతింప తరమౌనె
చిన్మయ స్వరూప – శ్రీనివాస!! 10

సప్త శైలశృంగ – సామ్రాజ్య నేతవై
భూత తతిని సాకు – పుణ్యమూర్తి
సహన శక్తి నిచ్చి – శాంతిని సమకూర్చి
చెంత జేర్చి కొనుము – శ్రీనివాస!! 11

కష్ట సమయమందు – గళమెత్తి పిలువగా
పరువు పెట్టి వచ్చి – ప్రజల గాచు
దైవమనిన నీవె – ధారుణీ తలమందు
శేషశైలవాస – శ్రీనివాస!! 12



కనులజూచు నీదు – కళ్యాణ రూపంబు
కలుష హారి యగుచు – కలిమి గూర్చు
చెవిని సోకు నీదు – శృంగార కీర్తనల్
జీవితాశ నెఱపు – శ్రీనివాస!! 13

రత్న మకుట కాంతి – రాగ రంజిత మౌచు
తిరుమలాద్రి పైన – తేజరిలగ
కవుల మనసులందు – కదలాడు భావాలు
తేనె వాకలట్లు – శ్రీనివాస!! 14

మాయ జాలమెల్ల – మంత్ర ముగ్ధుల జేయ
పరమ యోగులైన – భ్రమయుచుంద్రు
ఆరణేయు జన్మ – కాధార మదిగాదె
చిన్మయాంతరంగ – శ్రీనివాస!! 15

పాప పుణ్య కర్మ – ప్రారబ్ధ విభవమ్ము
కాల గమనమందు – కట్టు గట్టి
జనన మరణ దుఃఖ – మనుభవింపగ జేయు
శిక్షకుండ వీవె – శ్రీనివాస!! 16

ఏడు కొండలందు – ఎక్కడో గుడిలోన
వెలసి యున్న నిన్ను – పలుకరింప
కనులు మూసి పెదవి – కదుప వేమయ్యా? నా
చెలిమి సేయగదవె – శ్రీనివాస!! 17

సారహీనమైన – సంసార చక్రాన
తిరుగుచుంటి, దారి – తెన్ను లేక
దారి చూపి బ్రతుకు – ధన్యమ్ము జేయుమో
దీన జన శరణ్య – శ్రీనివాస!! 18

వికలమయ్యె మనసు – వేవేల రీతుల
విప్పి చెప్పరాని – విధముగాను
మనసు కుదుట బడెడి – మంత్రమ్ము బోధించి
చింత దీర్చు మయ్య – శ్రీనివాస!! 19

జన్మ జన్మలందు – సత్సంగ మిమ్మంచు
వేడి కొందు నెపుడు – విమల చరిత
కోరబోను నిన్ను – గొంతెమ్మ కోరికల్
శేషశైల వాస – శ్రీనివాస!! 20



సర్వ జగతి నేలు – సార్వభౌముడవని
శరణు జొచ్చినాడ – దురిత దూర।
కరుణతోడ నాదు – కళవళమ్మును బాపి
చిత్త శాంతి నిడుము – శ్రీనివాస!! 21

తమము నణచి వేయు – దరహాస చంద్రికల్
విశ్వమెల్ల పరచి – వేడ్కతోడ
సప్తగిరులపైన – చక్కగ నెలకొన్న
శీతకరుడ వీవె – శ్రీనివాస!! 22

పరిమళాల నీను – విరుల దండలు నీదు
గళము నందు వేయ – కాంక్ష గలదు
కామితంబు దీర్చి – కరుణించవే నన్ను
శ్రీకళా విలాస – శ్రీనివాస!! 23


నామ రూపములను – నరులు కల్పన జేసి
మురిసి పోవుచుంద్రు – పుడమిలోన
పేరు నూరులున్న – నోరేల లేదయా
జీవ శిల్పమైన – శ్రీనివాస!! 24

దివిని భువిని వెదుక – దృక్కుల గనరావు
హృదయ కుహర మందు – నొదిగి యుండి
గారడీడు వోలె – కనుకట్టు గట్టెదు
చిత్ర చిత్ర గతుల – శ్రీనివాస!! 25

మౌని వరుల వోలె – కాననంబుల కేగి
జపము తపము సల్పు – శక్తిలేదు
మనసు నందు నిన్ను – ఘనముగ తలచుచు
సేవ జేసి కొనెద – శ్రీనివాస!! 26

వాడి పోవు వఱకు – వాసన వెదజల్లు
పూవు వోలె బ్రతుకు – పాసగజేసి
నేల బడక మునుపె – నీ యున్కి గమనించు
రీతులెల్ల దెల్పు – శ్రీనివాస!! 27

పరమ పాపియైన – శిరముపై కరమెత్తి
నీకు మ్రొక్కనేని – నిశ్చయముగ
చిక్కులన్ని దీర్చి – చివ్వున చేయిచ్చి
చేది కొందువయ్య – శ్రీనివాస!! 28



దేహ మందు వెల్గు – దీపపు ప్రమిదలో
ఆయువనెడి చమురు – పోయుచుండి
అంకురించు ప్రాణు – లన్నింట తోతెంచు
చేతనత్వ మీవె – శ్రీనివాస!! 29

ఎదుటి వారి యెడద – నొదిగిన భావాల
నెరుగ శక్యమౌనె - యేరికైన
హృదయ మర్మమరయ – సదయుండు గావలె
శ్రితజన పరిపాల - శ్రీనివాస!! 30

అభయ హస్తమొసగి – యాదరించు మనగ
గతము తడుముదేల – గరుడ గమన।
ఆశ్రయించు జనత – కండ దండలు గావె
శేషగిరి నివాస – శ్రీనివాస!! 31

ఎల్ల పనులు మాని - ఏకాగ్ర చిత్తాన
సత్య శోధనమ్ము - సలుపు చుండ
సతియు సుతుల తోడ – సాధన కుదురక
చిక్కి శల్యమైతి - శ్రీనివాస!! 32

గోకులంబు బ్రోవ – గోవర్ధనంబెత్తి
కొాదమ సింగమట్లు – పొదలి నావు
రాస లీల దేలి - రాధమ్మ మది దోచి
సేవలందు కొనవె – శ్రీనివాస!! 33

నందు నింట బుట్టి - నవనీత హారివై
చిలిపి పనుల నెన్నో - చేయునాడు
ఘల్లు ఘల్లు మనుచు - గజ్జెలందెలు మ్రోగ
త్రిభువనాలు మెచ్చె - శ్రీనివాస!! 34

శబరి యెంగిలి తిని - సంతసించిన యట్టి
పరమ హంస వీవు - భవ్య చరిత।
సర్వ మయుడవీవు - సరిలేరు నీకేరు
చిద్విలాస యీశ - శ్రీనివాస!! 35

కర్ణ పేయమైన - గంధర్వ గానాన
గండ శిలలు గూడ - కరగిపోవ
మురళి రవళి చేత - మూడు లోకమ్ములున్
ప్రేమ జలధులయ్యె - శ్రీనివాస!! 36



అణువు నణువులోన - నణగియుండెడి నిన్ను
త్రికరణాల వలన - తెలుసుకొనిన
చావు పుట్టుకనెడు - జంజాటమును లేక
జీవి ముక్తి నొందు - శ్రీనివాస!! 37

మంచి చెడుల మధ్య - మనసు నూగుచు నుండ
చేయదగిన పనులు - చేయలేక
పిచ్చివానివోలె - పచ్చిగా వాకొందు
మేను మరచి పోయి - శ్రీనివాస!! 38

తండ్రి మాట బట్టి - తనయుండు వనికేగ
రమయు వోయె, రాజ్య - రమయువోయె,
కాముడున్న చోట - రాముడుండగలేని
చిన్నె లెన్న తరమె - శ్రీనివాస!! 39


చదువు లెల్ల చదివి - సర్వజ్ఞుడైనను
ఆలు బిడ్డలంచు - అంగలార్చు
నిన్ను తెలియ లేక - నిట్టూర్పు నిగుడించి
సిగ్గు చెందడకట - శ్రీనివాస!! 40

దొంగతనము చేసి - దొరలైన వారలు
ఉలుకు పలుకు లేక - ఊరు కొనగ
ఎరుక లేని వారి - నిరికింపజూచెదు
చిత్రమేమొగాని - శ్రీనివాస!! 41

యోగదృష్టి పోయి – భోగ దృష్టి పెరుగ
గతులు దప్పి జాతి – కలకబారె
నీతి రీతి పరిధి – నిర్వేద్యమైయున్న
చెన్ను మీరు జనత – శ్రీనివాస!! 42

అడ్డదారి త్రొక్కి – యార్జించి ధనమును
దొడ్డ వారి యందు – దొసగు లెంచు
దుష్ట బుద్ధులిలను – శిష్టులై మనుచుండ
కానవేమి నీవు – శ్రీనివాస!! 43

కులము మతములంచు – కుమ్ములాటలు రేపు
కుటిల వర్తనమ్ము – పాటమరింప
దానవత్వమిలను – తలయెత్తి జనతకు
చేటు తెచ్చు చుండె – శ్రీనివాస!! 44



మనిషి కట్టుకున్న - ఇనుప గోడలెగాని
కుల మతాలు లేవు - కువలయాన
మంచి మనసుకన్న - మతమేది? కులమేది?
మానవాళి కిలను - శ్రీనివాస!! 45

కలియుగాన బ్రతుకె - కష్టమై పోవగా
ముడుపు లెట్లునీకు - ముట్టగలవు
కాన్క లీయకున్న - కలుషముల్ కడుగవా?
హృదయ కుహర వాస - శ్రీనివాస!! 46

అల్పు లయిన వారి - కధికార మబ్బిన
పదవి పరువు పోవు - భయము గొల్పు
చదువు కొనియు జన్మ - సంస్కార మెరుగని
వానికేల పదవి - శ్రీనివాస!! 47

వ్యసన పరుని జూచి - పరిహసించిరి నాడు
వ్యసన పరుడె నేడు - భవ్యగుణుడు
మంచి చెడ్డలన్ని - మదిలోని మార్పు లె
శ్రీరమావిలోల - శ్రీనివాస!! 48

బంధు మిత్రులెల్ల - అందలం బెక్కించి
కోర్కె దీర్చు కున్న - కూల ద్రోయు
కుటిల జనుల తోడ - కూడరాదిలపైన
చిత్త మరసి చూడ - శ్రీనివాస!! 49

సిగ్గులేని వాడు – చెడ్డ పనులు జేసి
చిన్న నవ్వు నవ్వి – చెప్పుచుండు
వాని కంటె, భువిని – వాయసంబు మేలు
శేషభోగి శయన – శ్రీనివాస!! 50

న్యాయ పథము వెంట – నడచు వారల తోడ
తగవు పడుట భువిని – తగవుగాదు
అగ్గితోడ జేరి – యాటలాడదగునె
జీవితాశ విడిచి – శ్రీనివాస!! 51

ధనము కూడబెట్టు – తలపు మంచిదెకాని
ధర్మ మార్గమెపుడు – తప్ప రాదు
పరుల నోళ్ళు గొట్టి – పైకమ్ము గడియించు
చెనటి కేమి శిక్ష – శ్రీనివాస!! 52



కొండ వంటి మనిషి – గుండె లోతుల లోన
కొంచెమున్న చాలు – మంచి తనము
మహిత యశము తోడ – మనుచుండి జగతిలో
మాననీయుడగును – శ్రీనివాస!! 53

చదువు 'కొన్న' వాని – సరసత్వమంతయు
చొప్ప దంటు పగిది – నొప్పియుండు
చదువు వలన వచ్చు – సౌశీల్య భావాలు
వానికేల నొదవు – శ్రీనివాస!! 54

కామకేళి తోడ – కాలమ్ము గడిపిన
మనిషి పశువు వోలె – మారిపోవు
దాని నణచకున్న – మానవత్వమునకు
హీనగతియె గల్గు – శ్రీనివాస!! 55


ఇచ్చు వారలున్న – చచ్చు పాడును లేచి
దానమందు కొనగ –తపన పడును
'దాన మనిన మాటె' – ప్రాణమ్ము నిలుపును
శ్రీదయాధినాథ – శ్రీనివాస!! 56

కాలు జారెనేని – కాయమ్ము గాయమౌ
నోరు జార, మనసు – నొచ్చు కొనును
జారుపాటులున్న – జరుగు బాటుండునా
క్షితిని యేర్కైన – శ్రీనివాస!! 57

పరుల జూచినవ్వు - గురువింద గింజలు
తమను జూచి కొనరు - తలలు వంచి
ఆత్మశోధలేని - యాకతాయిల వల్ల
చేటు వచ్చె భువికి - శ్రీనివాస!! 58

పలువ లున్నయట్టి - పాడు సంఘము నందు
మంచి వారి యునికి - మాయమగును
కాకులున్న చోట - కలహంసలుండునా?
శ్రీవిలాస యాశ - శ్రీనివాస!! 59

మాన్యుడైన వాని - మానసంబు, చివరి
దశను గూడ నున్న - తమెయగు, రవి
యస్తమించు వేళ - నరుణ కిరణ పంక్తి
చేరుకొనదెనింగి - శ్రీనివాస!! 60



పలుకుబడి గలట్టి - వంది మాగధులకు
బట్ట నలగ కుండ - పనులు జరుగు
కష్టజీవి పడెడు - కడగండ్ల పోకార్ప
జేయు, సదయు లెవరు - శ్రీనివాస!! 61

ప్రతి దినమ్ము నిన్ను - భక్తితో భజియింతు
కుచ్చితమ్ము పోయి - కచ్చె తొలగ
మనసు మంచిదైన - మనువు సార్థకమౌను
శేష తల్ప శయన - శ్రీనివాస!! 62

వ్యక్తి పరిచయమ్ము - బ్రతుకు బాటను జూపు
తెలివి తేటలుండి - తెలుసుకొనిన
పరిచయమ్ము లేని - బ్రతుకేల నిలపైన
శేముషీ వికాస - శ్రీనివాస!! 63


స్వార్థ పరుని మ్రోల - సాష్టాంగ పడుకంటె
బండకట్టి బావి - బడుట మేలు
స్వార్థ పరుడు పరుల - సౌఖ్యమ్ము గోరునా?
మానసాన నెపుడు - శ్రీనివాస!! 64

అందినపుడు జుట్టు - అందకున్నను కాళ్ళు
పట్టు కొనెడి వారు ప్రబల చుండ
ఆర్ష ధర్మమెల్ల - అధ్వాన్నమై పోయి
జీర్ణదశకు చేరె - శ్రీనివాస!! 65

తల్లి భాష నేర్వ – నొల్లని తండ్రుల
యుల్ల మొటులు మహిని – పల్లవించు
తల్లి పాలెరుగని – తనయుల పగిదిగ
చేవలేక యుండు – శ్రీనివాస!! 66

ఉన్నవాడెపుడును – ఉన్న వానికె పెట్టు
లేని వానికిడడు – లేశమైన
ఉర్విలోన జనుల – ఉపకార భావాల
శీలమిట్టులుండె – శ్రీనివాస!! 67

పాఠశాలలకును – పఠనశాలలకును
హాజరైన చాలు – నదియె చదువు
చదువు సంధ్యలిట్లు – చట్టుబండలుగాగ
చివికి పోయె బుద్ధి – శ్రీనివాస!! 68



పూర్వ జన్మమందు - పురుడు పోసికొనిన
పాప సంచయమ్ము - బాపుకొనగ
'ఆత్మయజ్ఞ' మనెడి - యస్త్రంబు సంధించు
శిష్ట గుణము నిమ్ము - శ్రీనివాస!! 69

పుట్టె యందు పుట్టు - పుట్టెడు కోర్కెలు
తీరకున్న యెడద - తృప్తి పడదు
తృప్తిపడని యెడద - తృష్ణ తీర్పగరాదు
జీవితాన నెపుడు - శ్రీనివాస!! 70

సుఖములందు నపుడు - చూడడెంతటి వాని
కష్ట కాలమందు - కన్ను దెఱచు
ఇట్టి వారి సృష్టి - నేల చేసెనో బ్రహ్మ
శేషతల్ప శయన - శ్రీనివాస!! 71


రాజకీయ మిలను - రంగులు మారుచు
ఒప్పుచుండె ప్రజల - ఓట్ల కొఱకు
దేశ పాలనమ్ము - దిన దిన గండమై
చింత్య మానమయ్యె - శ్రీనివాస!! 72

చెట్టు చేమలన్ని - ఛేదించి వేసినన్
వన్య మృగములన్ని - వలస బోవు
నిలువ నీడలేక - నీరసింతురు జనుల్
జీవితాశ లేక - శ్రీనివాస!! 73

బుద్ధి లతకు పూయు – పూలతో పూజింప
కరిని గాచినట్లు – కాచు నీవు
తరులతాదు లిడెడి – విరులతో నర్చింప
తృప్తి నొంద గలవె – శ్రీనివాస!! 74

అస్తి నాస్తి చర్చ – విస్తారముగ జేసి
అంతుబట్ట లేరు – యజ్ఞపతిని
అహము గల్గువారి – కానందమయుడేల
కానిపించుమదికి – శ్రీనివాస!! 75

నొసలు వెక్కిరింప – నోరు మాటాడెడి
ధూర్తజనుల గనిన – దురిత మంటు
అట్టి వారిగుట్టు – రట్టు చేయగబోయి
శిలగ మారినావె – శ్రీనివాస!! 76



కలసి వచ్చు వేళ – కలతలన్నియుదీరి
పట్టుకొనిన మట్టి – పసిడియగును
కలసిరాని వేళ – కాలమ్మె సర్పమై
చిమ్ము చుండు విషము – శ్రీనివాస!! 77

అన్నమయ్య వోలె – ఆరాధకుడనౌచు
త్యాగరాజు రామ – తత్త్వ మరసి
మానవత్వమున్న – మనిషిగా బ్రతికెద
క్షితిని మేలు గూర్చు – శ్రీనివాస!! 78

సంతతమ్ము భువిని – సత్వగుణుని వోలె
సంచరించుకొనెడి – సంపదిడుము
తామసాన నీదు – తత్త్వంబు తెలియక
చెదరు చుండె మనసు – శ్రీనివాస!! 79

సర్వభూతములకు – సాక్షిగా నిలుచుండి
ధర్మ ముద్ధరింప – తనువు దాల్చి
అంతరాంతరాల – ఆత్మగా వెలుగొందు
చిన్మయుండవీవె – శ్రీనివాస!! 80

భజన సేయు నరుడు – బ్రహ్మమ్ముగనలేడు
సేవ చేయబోవ – చావదహము
ఇంద్రియాల నణచ – శ్రీశుడే దిగివచ్చు
శ్రీరమా విహార – శ్రీనివాస!! 81

మంచి చెడుల నరయు – మాన్యులు కర్వైరి
నడచు వారి వెనుక – నడతురెపుడు
గొ్ౖెదాటు మతము – కూర్చు నా సౌఖ్యంబు
చెరచు గాని జనుల – శ్రీనివాస!! 82

ముప్పు మాపు మంచు – ముడుపు లెన్నియొగట్టి
ఏడు కొండలెక్కి – యెదుట నిలువ
పొమ్ము పొమ్మటంచు – పుజారి నెట్టుటన్
చెప్పుకొనిన సిగ్గు – శ్రీనివాస!! 83

నీతి లేని బ్రతుకు – నీచమంచెంచరు
చెడ్డ బ్రతుకు కంటె – చెఱుపు లేదు
అట్టి బ్రతుకు కంటె – ఆత్మ హత్యయె మేలు
శేషశైలవాస – శ్రీనివాస!! 84



కలుములమ్మ వడిని – కరగి పోయెడి వేళ
మనము నందునన్ను – మరువ కుండ
పచ్చ బొట్టు పగిది – వదనాన ధరియించు
దీనజన శరణ్య – శ్రీనివాస!! 85

ప్రత్యహమ్ము నిన్ను – భక్తితో భజియించు
భక్త గణము పైన – రక్తి జూపి
దివ్య దర్శనమ్ము – తృప్తిగ నిచ్చెడి
శ్రీకరుండవీవె – శ్రీనివాస!! 86

పరమ సుఖము కొఱకు – ప్రాకులాడునె గాని
పాటు బడగ నొడలు – వంచబోడు
ఒడలు వంచకున్న – నొదవు నా సౌఖ్యంబు
వృషభశైల వాస – శ్రీనివాస!! 87

పరమ భక్తుడైన – ప్రహ్లాదు డొందిన
బాధ లేవి నేను – బడయకుండ
పిలువగానె వచ్చి – ప్రేమైక భావనన్
సేమ మరయు మయ్య – శ్రీనివాస!! 88

సమత మమత నెఱవు – జవరాలి వీవంచు
మంగమాంబ హృదయ – రంగమందు
ప్రణయ కేళి సల్పు – పట్టు భద్రుడవని
చేరి కొలుతునయ్య – శ్రీనివాస!! 89

నల్లనయ్య! నిన్ను - నమ్ముకొనిన నేను
విరహ తాపమంది - పొరలు చుండ
రాధ యధర సుధల - రంజిల్లు చుంటివా?
చీరవేమి దరికి - శ్రీనివాస!! 90

దేవుడనిన తప్పు - దేహియనిన తప్పు
చేయుమన్న తప్పు - చేయ తప్పు
తప్పులెంచు వారి - తప్పుడు సంస్కృతిన్
చిదుపవేమి ధరను - శ్రీనివాస!! 91

వగల మారి వనిత - వయసు సొగసు జూచి
ఒడలు మరచి వెంట - బడెడి వాని
మోహ మెడల కున్న - మోక్షంబు దొరకునా?
శేషగిరి నివాస - శ్రీనివాస!! 92



గొప్ప పనులు చేయ – గోరెడు వారికి
కష్ట శతములెన్నో – కలుగు చుండు
వాని నవల ద్రోయు – వాడె సన్నుతి నొందు
శ్రితజన పరిపాల – శ్రీనివాస!! 93

చెడుగు జూచి జనులు – చింతించు టేలకో
మంచి తనము చెడును – మాడ్చి వేయు
అగ్ని కణము దూది – నంత మొందింపదా?
శిఖి శిఖా సమాన – శ్రీనివాస!! 94

కోటికి పడగెత్తు – కోటీశ్వరుండైన
దైవ దూరుడగుచు – తనరెనేని
అంత్య కాలమందు – ఆయాసమున జిక్కి
చేరలేడు పరము – శ్రీనివాస!! 95

భూత దయయులేని – నేతలెందరొ నేడు
రక్కసీంద్ర పగిది – రాజ్యమేల
బుద్ధదేవు సూక్తి – బుగ్గయ్యె, జగతిలో
చెదరిపోయె శాంతి – శ్రీనివాస!! 96

నియమ నిష్ఠలున్న – నిస్వార్థుడవనిలో
భాగ్యహీను డౌచు – బ్రతుకలేడు
శీల ముజ్జగింప – శ్రీమంతుడౌ, వాడె
శిష్ట గుణుడు నేడు – శ్రీనివాస!! 97

కొడుకు కొఱకు మ్రొక్క – కొందురు కొందరు
కూడు పెట్ట కతడు – కొఱవి పెట్టు
కొఱవి పెట్టు కొఱకు – కొడుకె కావలయునా?
శిష్ట హృదయవాస – శ్రీనివాస!! 98

బ్రతుకు తెరువు కొఱకు – వెతగూరు ప్రజ యెల్ల
తప్పు సేయుచుంద్రు – ధరణిలోన
వారి తప్పులెల్ల – వారించి బ్రోచెడి
జీవరత్నమీవె – శ్రీనివాస!! 99

కర్మశాత్రులైన – కలిమాయ విబవుల
కపట కల్మషాగ్ని – కమిలిపోతి
కరుణతోడ నాకు – కనుపించి మదిలోని
సేగి తీర్చుమయ్య – శ్రీనివాస!! 100



ఫాలభాగమందు - బ్రహ్మ తేజమ్మును
కనుల యందు దివ్య - కాంతి వెలయ
శాంతి పథము వెంట - సంచరించిన యట్టి
శ్రీఘనుండవీవె - శ్రీనివాస!! 101

రామ మంత్ర మెపుడు - రక్షయై చెలువారి
పాప బుద్ధి నెల్ల - పార ద్రోలు
నామ భజన సేయు - నరుల నాలుక కది
చెఱకు రసము గాదె - శ్రీనివాస!! 102

విశ్వ రూపుడగుచు - విస్తరిల్లెడిదేవ!
ఇరుకు గుడులలోన - నిమడ గలవె?
రోషమంది తల్లి - రోట గట్టిన నాడు
చింత దీర్ప లేదె - శ్రీనివాస!! 103

విదురు నింట విందు - ప్రియముగా గుడిచిన
వేద వేద్య! నాదు - పిలుపు నంది
రమ్య గతుల తోడ - రమ్ము మా యింటికి
ప్రేమ మయుడవైన - శ్రీనివాస!! 104

నీదు మహిమ తెలియ - నెరుగ రాదెవరికి
అయిన నేమి? నిన్ను - నాశ్రయింప
పుణ్య గుణములెన్నో - బోధ జేసితి వయ్య
శిష్ట గురుని వోలె - శ్రీనివాస!! 105

పూలలోన మధువు – పొలుపారు రీతిగా
ప్రాణి కోటి యంత – రంగమందు
ప్రేమ శీధు విడెడి – పెనువేల్పువీవంచు
చింత జేతునయ్య – శ్రీనివాస!! 106


అఖిల జనుల కెల్ల – ఆనంద జనకమౌ
నీదు పల్కు కొఱకు – నిల్చి యుంటి
ఆర్తి నెల్లబాపి – అమృతంపు వాక్కులన్
వీను లలర జేయు – శ్రీనివాస!! 107

యాగ భాగ చయము – లారగించెడి దేవ!
బ్రతుకు లోని యనుబ – వాల నిటుల
విన్న వించు కొంటి – వినయ మింపెసలార
శ్రేయ మొనర జేయు – శ్రీనివాస!! 108



జలజ నాభ నాదు – శతకమ్ము నాలించి
కొండలన్ని దాటు – కొనుచు వచ్చి
ఆదరాన నన్ను – ఆశీర్వ దించుము
ప్రీతి కలుగునట్లు – శ్రీనివాస!! 109

జయము వేంకటేశ – జయము కిల్బిషనాశ
జయము తిరుమలేశ – సత్ప్రకాశ
జయము కలియుగేశ – జయము శేషాద్రీశ
స్నిగ్ధ భావ తేజ – శ్రీనివాస!! 110





# వృత్త సంకీర్తనము

(అనుబంధము)

# శ్రీ వేంకటేశ్వర నక్షత్రమాలిక

★★★

శ్రీయుత మూర్తి! మౌనిజన సేవిత దివ్య పదారవింద! యా
మ్నాయ వచస్స్వరూప! యసమాన బలాన్విత! నీదు సన్నిధిన్
పాయని భక్త శేఖరుల పంక్తిని జేరగ నెంచు నాకు భ
ద్రాయిత రూప దర్శన విధంబెరిగింపుము వేంకటేశ్వరా!!

– 2 –

కొండల నెక్కలేను, బుధకోటికి కొంగు పసిండి రూపమై
యుండెడి నిన్ను గాంచి సరసోక్తుల నాడగ లేను, నిత్యమున్
దండిగ వేడి కొందు భవతాప మడంపగ జేయుమయ్య, యో
గండరగండ! దుష్ట కలికల్మష మర్దన వేంకటేశ్వరా!!

– 3 –

కొలిచిన నీదు రూపమునకుంఠిత భక్తి గుణంబుగల్గు, తా
తలచిన నీదు నామము సుధారస వాహిని ముంచి యెత్తు, వే
నిలిపిన నీదు తేజము వినిర్మల విద్యలు బోధ జేయు నో
కలియుగ దైవమా! పరమ కారుణికోత్తమ వేంకటేశ్వరా!!

– 4 –

కంటిని కావ్య రాజముల గాథల నెల్ల; మహాద్భుతంబుగా
వింటిని హేతు వాదముల వింతలనంతము; చూడ చూడ నీ
రెంటను సత్యమేదొ వివరింపగ నేరక ప్రాణి కోటి క
న్నింటికి జీవమీవె గాని నిశ్చయ మొందితి వేంకటేశ్వరా!!

– 5

ఎందరు గోపికారమణు లిచ్ఛ ను మెచ్చి వరించి నారో? యిం
కెందరు పుణ్యపూరుషుల బిప్సిత మొంది తరించి నారో? పె
రొందిన పాపరాధులిల నుత్తలమంది లయించినారో? వా
రందరి జాడ లేనెరుగ నార్త జనావన! వేంకటేశ్వరా!!

– 6 –

చెలిమి తొలంగెనేని తన చెంతకు చేరరు మిత్రులెవ్వరున్,
కలిమిలయించెనేని నిజకాంతయు రోయును నెమ్మనంబునన్,
బలిమి యడంగెనేని గత వైభవమంత నశించు; నష్ట ని
న్నైలమిదలంచినంత విషయేచ్ఛ లడంగవె వేంకటేశ్వరా!!

– 7 –

తప్పు లెరుంగ లేక దురితంబులనేకము మందబుద్ధినై
గొప్పగ జేసితంచుకడు కుందెదనిప్పుడు తెల్విగల్గి, నా
తప్పుల నోర్వ నీవెగతి; తక్కటి వేల్పుల గొల్వబోను; నీ
కొప్పిదమైన రీతి ననునోమవె సత్కృప వేంకటేశ్వరా!!

- 8 -

చేరిన కాసు వీసముల చిక్కులు దీర్చెడి ధార్మికత్వమున్
దూరిన యంక పొంకముల దోషమడంచెడి శాంత చిత్తమున్
కోరిన శక్తి యుక్తులిల కూరిమినిచ్చెడి నీదు మంగళా
కారము కన్నులన్ బడగ గల్గదె మోదము వేంకటేశ్వరా!!

-9 -

అంతము లేనిదీ జగతి యంతయు మాయ యటంచునేదొ వే
దాంతము పల్కు చుందురు గదా। సభలందున, సుంతవారిలో
గొంతుమె చిత్తశుద్ధని యొకానొక పట్టున నైనగాని; యే
కాంతమునందొనర్చెడి వికారములన్ గను వేంకటేశ్వరా!!

- 10 -

పలుకులలో విరాగమును భావములంద నురాగ మొప్ప నీ
తులు వచియించు చుందురుగదోయి విశుద్ధ మనస్కులై సదా
కిలకిల నవ్వుచున్ జగతి కేవల కృత్రిమ భావ మూర్తులై
చెలగిన దోసమంచనెడి సిగ్గది యుండదు వేంకటేశ్వరా!!

11 -

శైల శిఖాగ్రవాసమున శైల గుణంబులు నిన్ను బొందెగా
బోలు, దయార్ద్ర చిత్తుడవు పోల్చ గరాని శిలాత్మకుండవై
గ్రాలుచునుంటివేల? త్రిజగన్నుత। మామక కష్ట సంఘము
న్నాలన సేయగా నొక శిలాకృతి వైతివ వేంకటేశ్వరా!!

– 12 –

పాలన సేయుటే తగును భక్తులు కోరి భజించుచుండ, నీ
యాలన పాలనా రహితులై యిలనేగతి ముక్తు లౌదురీ
కాల కరాళ గహ్వర వికార విపత్పరి వేష్టితాత్మ క
ల్లోలిత జీవకోటి యతిలోక గుణాన్విత వేంకటేశ్వరా!!

– 13 –

కొలిచెడి దీన మానవుల కుంఠిత భక్తి రసా ర్ద్ర చిత్తులై
పిలువగ పల్కు దేవ। నిరుపేదలపాలిటి పెన్నిధానమై
నిలిచిన నీదు రూప మహనీయత వాకొన నాతరంబె? ఆ
కలుముల తల్లియే పొగడ గావలె సొంపుగ వేంకటేశ్వరా!!

– 14 –

మెచ్చినగాని యాతనిని మెచ్చ రటంచు దలంచి, ముందుగా
మెచ్చులె పల్కు చుందురవి మేలౌన గూర్చునె। యేరికైన; నా
మెచ్చుల జీవితంబు మెరమెచ్చులదై వ్యథగూర్చు; నైననున్
సచ్చరితుండు గూడ ముఖ సంస్తులో బడు వేంకటేశ్వరా!!

– 15 –

వందియు మాగధుండు బలె ప్రస్తుతి సేయగ, నెంతవారలున్
బందుగునైన గాని విడువన్ వెనుకాడరు, స్తోత్రపాఠి నా
నంద నిమగ్న చిత్తమున నాదర దృష్టి జూచి వానితో
బందుగుకన్న మిన్నగను వర్తిలు చుందురు వేంకటేశ్వరా!!

– 16 –

నీవనువాడవీ జగతి నీగతి రక్ష యొనర్చుకున్న తా
రేవిధి నుండగా గలరొ యించుక యైన తలంపబోవరో
పావన మూర్తి! నీ పరమ పావన నామము నాత్మలోన సం
భావన సేయు వారికి శుభంబులు గల్గవె వేంకటేశ్వరా!!

– 17 –

నరుడను వాని బ్రహ్మ సృజనంబొనరించియు నంతబోక యా
నరునకనంత బుద్ధ నిడినాడిల, వాడొక సృష్టి కర్తగా
బరగుచు మర్త్య లోకమున భాసుర సృష్టి నొనర్చుచుండె, యీ
యిరువుర నెవ్వరెవ్వరి సృజించిరొ తెల్పుము వేంకటేశ్వరా!!

– 18 –

సరసపు వర్తనంబున యశంబొనగూడు నటన్న సూక్తి లో
నెరిగిన వారు గూడ గడు హీనపు వర్తనులై చరింతురీ
వరయక యుంటచే నదియు నభ్యుదంబగు మార్గమంచు నీ
నరు లనిశంబు తద్గతి చనంగ దలంతురు వేంకటేశ్వరా!!

– 19 –

తిరుపతి పోవు వారుకడు దివ్య పథంబగు కాళహస్తి బో
వరు సమయంబు లేదనుచు; పాడియెయిట్టు లొనర్ప; దేవులం
దరు నొకటే యటన్న మరి ధారుణినిన్ని విధాల దేవులన్
వరలగ జేయనేల? తెలుపంగదె యిమ్ముగ వేంకటేశ్వరా!!

– 20 –

చేసెడి దాని సిగ్గు విడి చెప్పును సత్పురుషుండు; దానినే
మూసి మరో విధిన్ బలుకు ముద్దుగ మధ్యముడైన వాడు; నే
బ్రాసి యథార్థ మెన్నడును బల్కడు, దానను నేమివచ్చు; స
న్యాసి తనంబె కన్పడు యథార్థము దాగదు వేంకటేశ్వరా!!

– 21 –

ధనమున కాసజేసి తలిదండ్రుల బంధుల కాలదన్నుచున్
మనమున శంకలేక యభిమానము, లజ్జయు వీడి దుష్ట చిం
తనమున సర్వసంపదలనంతముగా గడియించు వారి జీ
వనమున శాంతి యుండునె రవంతయు నైనను వేంకటేశ్వరా!!

– 22 –

ఒకడొక గద్దె నెక్క నొకడూరక వానికి నీళ్ళుదోడు; నిం
కొకడు మహోన్నత స్థితిని నుండగ నొక్కని కన్నుకట్టు; పె
రొకడు విపత్తులంబడ మరొక్కని కెంతయొ తృప్తిగల్గు; వా
రికినిది నైజమైన జనులేగతి మెత్తురు వేంకటేశ్వరా!!

– 23 –

సరసులు మెచ్చు లాగున విశాల విభావన గ్రాలుచున్న నే
దురితములంటకుండునని దోషవిదుల్ విశదీకరింతు రా
పరమ రహస్యమున్ దెలిసి వర్తిలునట్లు దలంపకీ నరుల్
గురుతర దోష పంకమున గూలగ నెంతురు వేంకటేశ్వరా!!

- 24 -

ఘనమగు గుజ్జు రూపమును, కార్యములన్ జెడగొట్టు నేర్పు, నా
ననమున నేన్గు పోలిక గనంబడునట్లుగ నేకదంతమున్,
ఖనకము వాహనంబుగను, కల్పన జేసిన విఘ్న నాయకున్
తనదు నిజ స్వరూపము కనంబడదెందును వేంకటేశ్వరా!!

- 25 -

సారము లేనిదే యగు విచారము జెందగ నేల తాము సం
సారము గూర్చి, బిడ్డలను సారము లేవిదియైన యట్టి సం
సారములోన ద్రోయుదురు సారమెరింగిన పెద్దలెల్ల, నీ
కారణమేమొ దెల్పు మిల గారవ మొప్పగ వేంకటేశ్వరా!!

- 26 -

సురుచిర రూప సంపదల సోయగముల్ వెలయించువాడవై
పరమ మునీశ్వరేశ్వర తపః ఫలకాంతుల చెన్ను మీరుచున్
కరమనురక్తి మీర మమకారములన్నియుడుల్లజేసి యీ
ధరణిని గాచు పెద్ద సరదారుడ వీవెగ వేంకటేశ్వరా!!

- 27 -

చదువుల తల్లి నన్ను తన సందిట జేరిచి ముద్దు లాడి, తా
పదముల పొంకముల్ దెలియబల్కుచు చక్కగ తీర్చి దిద్ద నె
మ్మది నిటు బల్కుచుంటిని రమావిభవాతిశయుండవైన నీ
మదికి ముదంబెసంగ, నను మాన్యుని జేయుము వేంకటేశ్వరా!!

# నివేదన

★★

శ్రీగల యింట బుట్టి, తులసీదళదామ విభూషణావళుల్
భోగమటంచు నెంచు ఘన పుణ్య విభుండగు నమ్మురారికిన్
సాగిలి మ్రొక్కు చుందు భవ సాగర మీదెడి శక్తి యుక్తులన్
వేగిర మిచ్చు గాత యని విహ్వల చిత్తత నార్తి నొందుచున్!!

– 2 –

సేమము కోలుపోయి, విభుసేవలు మెండుగ సేయలేక, దో
షామయ జీవినై బ్రతుక సాకుచు నుంటిని దుర్భరంబుగన్
మామక వేదనల్ తొలగు మార్గము జూపుచు బ్రోచు నీదు ని
ష్కామ కళా విలాసమును కంజదళాక్ష! నుతింతునిత్యమున్!!

– 3 –

కమ్మని వేణుగానము వికారము లన్నియు బాపి కృష్ణత
త్వమ్ము మనమ్మునంగ దుర భాసిలు తానొక యోగివోలె, నే
కొమ్మను జూచినన్ మధుర కూజిత నిస్వనమే ధ్వనించుటన్
అమ్మక చెల్ల! నా హృదయ మమ్మక చెల్లద యేమి సేయుదున్!!

**– 4 –**

బుద్ధి తెలియని వయసున హద్దు మీరి
కాని కార్యంబు లెన్నియో గడపి నాడ
అభయమిమ్ము ముకుంద నే నార్తి నొంది
అడుగుచున్నాడ బేలనై బిడయ పడుచు!!

**– 5 –**

మోక్ష సామ్రాజ్య లక్ష్మి యుప్పొంగునటుల
భక్త తతికెల్ల బ్రియమున ముక్తి నొసగి
లోకముల గాచు రాధికాలోల! కొనుము
ప్రేమ మీర హృదయ నివేదనమ్ము!!

◆◆◆



# ఆకాంక్ష



శ్రీరమణీమణీ కరకుశేశయ పూత మరంద ధారలన్
జారగొనన్ మధువ్రతము చొప్పున జీవిత యాత్ర జేయగా
గోరి భజించు చుండెద నకుంఠిత భక్తిని నిన్ను గూర్చి; నా
కోరిక దీర్పవే లలిత గోప వధూ మధురోప గూహనా!!

– 2 –

నీ వదనార విందమును నిత్యము నా హృదయాంతరాన స
ద్భావముతో ధరింపగ నుపాయములిన్ని దినాల నుండి నా
కేవిధి జిక్కదయ్యె, తుదకీ విధి నీకవితాసుమాల నా
భావమునన్ బ్రగాఢముగ బంధితుగా నొనరించు కొందుగా!!

– 3 –

మనమున నెమ్మిగూర్చి విసుమానముగల్గ జగంబునందు మ
త్తనువును స్వీకరించి ననుధన్యుగ జేయుదువంచు ముగ్ధమో
హన వదనమ్ము పైని నడయాడెడి వేణురవమ్ములోన నన్
అనిశము ముంచి యెత్తెదవటంచు యశోద కుమార నమ్ముదున్

— 4 —

వికలత జెందు చిత్తమును వేయి విధంబుల చిక్కబట్టుచున్
సకలము నీవె యంచు మది సాధన జేసి గ్రహించినాడ, నీ
వికసిత పాద పద్మ మధు బిందువులానెడి భృంగ పంక్తిలో
నొక యెలదేటిగా బ్రతుక నువ్విళులూరుచునుందునో ప్రభూ!!

— 5 —

తలిరుల జిందులాడు నునుదళ్ళ్కుల వోలె చరించు సంపదల్
గలిగిన నాల్గు నాళ్ళు నినుగానగ లేక నకార్య శీల సం
కలిత మనోరథమ్ములను గాలము బుచ్చుచు వ్యర్థ జీవినై
కళవళమందు చుంటి నను గావుము వేగమ రుక్మిణీధవా!!

— 6 —

ఎప్పటికప్పుడే హృదయ మిచ్చి భజింతును, నన్ను జూడకే
తప్పి చరించు చుందు విది ధర్మమె? నీ హృదయాంబుజాత మం
దెప్పటికైన నీ జనుని యేలెడి కోర్కె జనించు నేమొ యం
చొప్పగ నాసబూని యిటులుంటిగదా। దయజూడరాగదే!!

— 7 —

హృదయమునందొకింత కరుణింపగ నిన్ బ్రతిమాలుకొందు, నీ
పద జలజద్వయిన్ మిగుల భక్తి దలిర్ప ధరింతు నౌదలన్
ముదమొదవించు నీ మధుర మోహన రూపము నాకురంగటన్
విదిత మొనర్చుమయ్య, కడు వేసట నందితినో యదూద్వహా!!

